'యిన్నాళ్లూ ఎప్పుడైనా యిలా జరిగిందా, వళ్ళల్లో బాగు లేదు గనక-పని ఆగిపోయింది. ఆ మాట కొస్తే యిన్‌ఛార్జిగారిదే తప్పు. ఎప్పుడు ఫైల్సు పట్టుకెళ్ళినా, యిదా టైమ్ బిజీగా ఉన్నానని పంపేస్తున్నారని మేమూ రిపోర్టు చేస్తాం' అన్నారంతా.

'అది కాదోయ్ మనలో మనకి గొడవ లెందుకూ ఎవరి పనులు వారు చేసుకు పోవాలి మీకు మాత్రం తెలీదు ఏదో పెద్ద వాడ్ని గనక మీకు చెప్తున్నాను.' అంటూ చప్పరించాయన-తప్పు తనలో కూడా ఉంది గనక.

బరువుగా గడిచి పోయింది కాలం-వారం రోజులూ.

—ఆరోజు మళ్ళీ కళకళ్లాడుతోంది ఆఫీసు-పావు తక్కువ పదికే సంక్రాంతినాడు తలకి స్నానం చేసి కొత్త వస్త్రాలు ధరించినట్లు, అంత నీటుగా ముస్తాబై ఎవరిసీట్లులో వాళ్ళు హాజరై ఓరకంటితో ద్వారం వైపు మాత్రం చూస్తున్నారు కారణం ఆరోజు అరవింద వస్తుం దని మనకి తెలుసు సమ్మెట పోటులా ఠంగ్.. ఠంగ్.. మంటూ పదకొండు కొడుతూండగా అందంగా అడుగు పెట్టింది స్వేచ్ఛగాలి పీల్చి తేలిగ్గా నిట్టూర్చింది ఆఫీసంతా అరవిందని చూసి.

కానీ ఆ సంతోషమంతా క్షణంలో హారతి కర్పూరంలా హరించుకు పోయింది క్షణంలో. గుడ్లు తేలేసి సీట్ల కంటుపోయింది స్టేఫ్ అంతా. 'అరవిందని కన్నెత్తి చూడ్డానికి వీల్లేదు—ఆమె లైసెన్సు పుచ్చుకుంది-' అంటూ చిరునవ్వుతో పలకరించింది కొత్తమంగళసూత్రం-

# - రిటైర్ -

రచన: మాస్టర్ రవి

రిటైరైపోవడం అనే పద్ధతి ఎందుకుందో, ధర్మయ్యని చూస్తే తెలుస్తుంది.

పేరుచూసి మోసపోకండి. ఆయన ఎన్నో అధర్మకార్యాలు చేసి, ఎందరి జీవితాల్లోనో నిప్పులు పోసి, ఎంతమంది కాపురాలనికూల్చి, ఎంతమందినో ఆత్మహత్యకు పాల్పడిజేసి-ఈ నాడు వూళ్ళో ఒక పలుకుబడిగల వ్యక్తిగా, ధనవంతుడిగా బ్రతకగలుగుతున్నాడు.

రిటైరయిపోయే సమయం వచ్చినా, అతనికి, అలా అవడానికి ఏమాత్రమూ ఇష్టం లేదు. ఎంచేతంటే, అతనికింకా ధనదాహం; కామ దాహం-ఇత్యాదివేవి తీరకపోవడమే.

మరో చెప్పుకోదగ్గ ముఖ్య గమనిక ఏమి టంటే-అతని కన్న ఎవరన్నా బాగున్నా రన్నా; బాగున్నారని విన్నా; కష్టపడి పని చేస్తున్నారని తెల్సినా, కళ్ళల్లో నిప్పులు పోసు కుంటాడు. ఇంతటి ఈర్ష్యాపరుడు మరోడుండడు. అతడి కతడేసాటి.

కుటుంబం గడవక; చేతికంది వచ్చే మగ పిల్లలు లేక; ఉద్యోగం చేసే చదువు లేక పోయినా, గుండెల మీద కుంపటీలా ఎదిగిన ఆడపిల్లలు ఇంట్లో ఈకొసనుంచి ఆ కొసకి తిరు గుతూండడం చేత; వేరే గత్యంతరం కానక

పోవడంవల్ల. రిటైరయి పోయినా, ఇంకా మరి కొన్నాళ్ళు పనిచేసి, కుటుంబాన్ని వెళ్ళమారుద్దామనుకునేవారి సంగతి అంటే – అర్థముంది. తప్పని పరిస్థితి. మరి ఈధర్మయ్యకిదేం పొయ్యే కాలం? బాధ్యతలు, బాదర బందీలు లేవు. వెనక 60,70 వేల రూపాయల నగదు వుండడానికో చక్కని డాబా; భార్య మెడలో తక్కువలో పది తులాల బంగారం ఇంకా ఎందుకో ఈ ధర్మయ్యకీ ధనదాహం?

దాహమంటే వుంది గాని, ఆకలంటే మెండుగానీ, హరాయించుకునే శక్తి ఏదీ?

రిటైరు సమయం వచ్చేసరికి, దాదాపుగా, మనస్సూ, శరీరమూ విశ్రాంతి కోరుతూ వుంటుంది. చెవులు, కళ్లు–కాస్తమందగిస్తాయి. కోపం అధికమౌతుంది అసహనం, ఈర్ష్య; తన కెంతో అనుభవమున్నదనే ఒక రకమైన 'ఇది' ఇల్లాంటి పనికి భంగకరమైన లోపాలు బాగా పొడసూపుతాయి. ఇలాంటి అనేక కారణాల వల్ల రిటైర్‌మెంటు అనేది ప్రవేశపెట్టబడింది.

ఆర్థబలమూ, అంగబలమూ మొదలైనవి వున్న ధర్మయ్యలాంటివారికి, రిటైరయింతర్వాత తిరిగి పని చేయాల్సిన అవసరం లేకపోయినా, తీరనిదాహం కారణంగా, తానూ పనిలో చేరాడు. పనిలో అంటే చేరాడుగాని; యువకులతో సమంగా పని చేయగల శక్తి ఎక్కడిది? ఆ చురుకుతన మెక్కడిది? ఆ బల మెక్కడిది?

ఆఫీసులో రోజూ ఇదే గొడవ. చెప్పేవిషయాలు చెవులు కాస్త మందగించటం వల్ల వినబడవు. దృష్టిలోపం ఆవహించటం వల్ల, ఏం రాసిందీ తెలీదు జ్ఞాపకశక్తి సన్నగిల్లటంవల్ల, ఏ విషయమూ జ్ఞాపకముండదు. ఈలోపాలన్నీ తనకు వున్నాయని ధర్మయ్యకు తెలుసు. అవి ఇతరులు, తన క్రింది ఉద్యోగస్తులు గ్రహిస్తున్నారనీ తెలుసు. అంచేత, అయిందానికీ కానిదానికి భిర్రు బుర్రులాడ్డం; వూరకనే లేనిపోని లోపాలు ఎంచిచూడ్డం, నోటికొచ్చినట్లా వాగడం–మొదలెట్టాడు.

సముద్రుడు ఎంతో హోరు చేస్తున్నాడు. ఎంతో నెమ్మదైన వాడు కూడా తన హద్దు ఎంతో అంత అది దాటి ఏనాడూ రాలేదు. ఆ సముద్రుడే, తన గీతదాటి వస్తే? ఈ



మహాప్రపంచం ఏమౌతుంది? జలార్ణవంలోకి పోదూ?___

అలాగే ఓరోజు, ఆఫీసులో అందరూ ఒక్కుమ్మడిగా తిరుగుబాటు చేద్దామని నిర్ణయించుకున్నారు. "ఇవి నీలోపాలు. నీలో ఇన్ని లోపాలుంచుకుని; అనవసరంగా మమ్మల్ని దుయ్యబట్టడం చాలా అన్యాయం. ఈ విషయంలో నువ్వు క్షమాపణ కోరుకుంటావా? లేక, అంతా కలిసి, పైఅధికారులకు మహజర్లు పంపమంటావా?'-అని. ధర్మయ్యకి, నోటికొచ్చినట్టు వాగడమైతే వచ్చు గానీ, ఎవరైనా ధైర్యం చేసి, ముందుకు వచ్చి, ఎదురై, గట్టిగా నిలదీస్తే నెర్వస్ వీక్‌నెస్ వచ్చి, గజగజలాడిపోతాడు. అసలు చాలామంది ముసలివారిలో వుండే లోపమే ఇది.

* * *

సాయంత్రం అయిదయింది. ఆఫీసు కుర్చీలు ఒక్కొక్కరే ఖాళీ చేస్తున్నారు టైపిస్టు మాత్రం ఇంకా శబ్దం చేస్తున్నాడు. హెడ్ క్లార్కు రమణయ్య వచ్చి 'సోమయాజులూ! ఇవాళ్టికి ఆపేయరా, మేమంతా ప్లాను వేశాం నీకేం భయంలేదు పదపోదాం___' అన్నాడు. మిగతా ముఠా అంతా రెడీగా వున్నారు. అయిదూ పది అయేసరికీ, ఆఫీసు ఖాళీ! ధర్మయ్యకి, ఓపిక చచ్చిపోవడంవల్ల; కాస్త ఆకలి ఎక్కువ కావటం వల్ల ; ప్రతిరోజూ నాలుగున్నరకి మస్తుగా టిఫిన్ ఎక్కించి; ఆఫీసుకివచ్చేవాడు. ధర్మరాజుగారు ఆఫీసులో వుండగా ఠక్కున అయిదు అయేసరికీ వీళ్లంతా ఎలా వెళ్లిపోగలరు? చచ్చినట్టు ఆరు, ఆరున్నర వరకూ వుండిపోయేవారు ఓవర్ టైము పని చేస్తున్నారని సానుభూతి కూడా లేకుండా తను తిన్న టిఫిన్ మోతకు ఘూంఘూంమనిపించేవాడు.

ఇవాళ అదృష్టవశాత్తూ అయిదువరకూ; మహానుభావుడు రాకపోవడంతో కథ బాగా రక్తి కట్టింది. దీనికి కారణం, ధర్మయ్యకి కాస్త బాగా నిద్ర పట్టేయటం. అయిదుంబావుకి ఆఫీసుకి వచ్చేసరికి, బంట్రోతు ఫకీరు మాత్రం వున్నాడు.

'వీళ్ళంతా ఏమైనారు?'

'సరిగ్గా అయిదు అయేసరికి వెళ్లిపోయారు సార్___'

'ఆఁ... వెళిపోయారా? నేను రాకుండానే. ఎంత బుర్ర తిరుగుడు? వుండుండు వీళ్ళ పని చెప్తాను ఎంత అవిధేయత హాట్ హూట్'-

అటూ వెళిపోయాడు తిరిగీ ఇంటికి. ఆ మర్నాడు ఆఫీసులో___

'నిన్న మీరు ఎందుకలా చేశారు?' నిలదీసి అందర్నీ అడిగాడు ధర్మయ్య.

'రోజూ మీరెందుకలా చేస్తున్నారు? ఆఫీసు టైము ప్రకారం మేం పని చెయ్యక పోతే మీరు మమ్మల్ని అడగాలిగాని, మేమేం తప్పు చేశామని ఇలా నిలదీసి అడుగుతున్నారు? అయిదు గంటలకు ఆఫీసు మూతపడాలి. అదే నిన్న నయింది. అన్నాడు రమణయ్య అందరి తరఫునా.

ధర్మయ్యలో అప్పుడే వీక్‌నెస్ పట్టుకుంది. మేకపోతు గాంభీర్యం వుందిగా.

(తరువాయి పక్క పేజీలో)

# కన్నీటిబిందు

రచన:
శ్రీ ఎ. వి. సీతారామమూర్తి

ఆనందంగా కన్నులు మెరిశాయి. వేయి వెల్గులు కళ్ళతో మెదిలాయి. అనురాగానికీ, అభిమానానికీ ఆలమైనదా వెలుగు. నాలో క్రొత్తదనమిచ్చిన సంతోషమది. సమాజంలో తండ్రిగా మొట్ట మొదట తల్చుకొన్న క్షణమది. శశి ప్రసవించింది. తమ కొక ముద్దుల బాబు. శశి...నా శశి...అందాల రాశి... నన్నొక తండ్రిని చేసింది. ఎంత అదృష్టం! బాబు ఎవరిపోలికో? నా పోలిక వద్దు భగవంతుడా? నా అందాల శశిరూపమే బాబులో ప్రతిబింబింప జేయి తండ్రీ...అనుకున్నాను మదిలో.

పోష్టుమేన్ వెళ్ళిపోయినట్లుంది, టెలిగ్రాం మరొకసారి సంతృప్తిగా చదివాను. వెంటనే వెళ్ళి బాబును చూడాలనిపించింది. లోపల పోపు వాసన కొడ్తూంది. త్వరగా వంటకానిచ్చి వచ్చి మేను వాల్చేను. శశి నాకళ్లలో మెదులూంది.

‘అందాలరాశి’ అనుకున్నాను: బాబు వల్ల శశిలో కళ నశించదు కదా...కశిగా ఆమె మిసమిసలాడే చెక్కిళ్లుకొరికి వేయాలనిపించింది. బాబు జ్ఞాపక మొచ్చాడు. అమ్మో...బాబు నొచ్చుకోడూ...ఇక మీదట శశి బాబు పొత్తేనేమో! ఎంతైనా అమ్మ కదూ! అనురాగానికీ అభిమానానికీ అడ్డేలేదు. ఎటొచ్చీ నేనే దూరమౌతానేమో. ఎన్నటికీ కాకూడదు. శశి అలా ఎన్నటికీ కానీయదు. శశి నా పట్ల గౌరవాని కెన్నడూ భంగం వాటిల్లనీయదు. కోరికలు కలలా తేలిపోతున్నాయి.

\+ \+ \+

రాత్రి ఏడున్నర అయింది. తిండిమీద ధ్యాసేలేదు. కానీ...చేసిన వంటంతా దండగౌతుంది. ఏవో రెండు మెతుకులు తిని మేను వాల్చేను. మళ్లీ నా శశీ నా ముందు నిల్చింది.

పెళ్ళయి రెండేళ్ళయింది. తమ సంసారంలో ఎటువంటి కలహాలూ రాలేదు. శశి ఉత్తమ ఇల్లాలు. నేనంటే ఎంత ప్రాణం! నాతోనే తనకు లోకమట. నేను లేనిదే లోకమే లేదట. ఎంత మంచితనం! విద్యార్థిగా వుండే కాలంలో కాబోయే భార్యగూర్చి కనిన కలలన్నీ నిజమయ్యాయి. గతం స్మృతిపథంలో మెదిలింది.

---

‘అంటే మీవుద్దేశం ? ఎవరితో మాట్లాడుతున్నానో తెలుసుకునే మాట్లాడుతున్నారా?’- అడిగాడు ధర్మయ్య.

‘‘తెలుసు. బాగా తెలుసుకునే మాట్లాడుతున్నాం. శరీరంలో, పంచేంద్రియాల్లో పటుత్వం తప్పినా ధనదాహం,అధికారదాహం తీరనందున నోటికొచ్చినట్లల్లా మాటాడి; తనలోని లోపాలు కప్పి పుచ్చుకునేందుకు, ఇతరులపై, పదేపదే నోరు చేసుకునే, ధర్మయ్య అనే ఒక అధర్మ వర్తకునితో—అని, తెల్సే మాట్లాడుతున్నాం. పని చేయించుకునేందుకు కావల్సింది అధికారం కాదు. మంచితనం-’’ శలవ్-అంటూ ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చుని పనులు చేసుకో సాగారు.

ఆ తర్వాత కొద్ది కాలానికి, ధర్మయ్య పిచ్చెత్తి పోయాడని అంటారు. మరేమో? నాకు తెలీదు.